క్లుప్తంగా

కూలిన పొగాకు బ్యారన్ గోడ

దుత్తలూరు: మండలంలోని రాచవారిపల్లికి చెందిన బంకా వెంకటరమణమ్మకు చెందిన పొగాకు బ్యారన్ గోడ ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయాయి. బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. పునర్నిర్మించడానికి చాలా ఖర్చవుతుందని తెలిపింది. పొగాకు బోర్డు అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంది.

కూలిన ఇంటికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

వింజమూరు (ఉదయగిరి): మండలంలోని కాటేపల్లిలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయిన దొడ్డేటి వెంకమ్మకు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా వచ్చే ఆర్థిక సాయాన్ని కూడా త్వరలో అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి న్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

మర్రిపాడు: మండలంలోని అల్లంపాడు రెవెన్యూ పరిధిలో నెల్లూరు– ముంబయి జాతీయ రహదారి పక్కన విలువైన ప్రభుత్వ స్థలాన్ని భూకబ్జాదారుల నుంచి కాపాడాలని తహసీల్దారు ఆనందరావుకు స్థానికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో ఆక్రమించిన భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని బోర్డులు సైతం ఏర్పాటు చేశారన్నారు. అయినా భూ కబ్జాదారులు బోర్డులను తొలగించి యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రామాలయంలో చోరీ

కలిగిరి: కలిగిరి పంచాయతీ పాపనముసిలిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు, గ్రామస్తుల సమాచారం మేరకు ఆలయంలోని ప్రధాన తలుపు పగులగొట్టి దుండగులు లోనికి ప్రవేశించారు. ఆలయంలో రెండు హుండీలు ఉన్నాయి. ఒక హుండీని అక్కడే పగులగొట్టి అందులోని నగదును అపహరించారు. మరో హుండీని తీసుకువెళ్లారు. ఎస్సై ఎం.సూర్యప్రకాష్‌రెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. హుండీల్లో సుమారు రూ.10 వేల నగదు ఉండవచ్చునని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వరి, ఉద్యాన పంటలకు నష్టం

- నష్టం అంచనాలు సిద్ధం చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు
- వరి రైతులకు సబ్సిడీపై విత్తనాల సరఫరా
- నష్టపరిహారంపై ఆశాఖలకు నివేదిక



వరికుంటపాడులో గాలుల ధాటికి నేలకొరిగిన బొప్పాయి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి: తుఫాన్ ప్రభావంతో సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షం, గాలులకు ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సాగు చేసిన వరి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 180 ఎకరాల వరి పంట నేలమట్టమైంది. వింజమూరు, ఉదయగిరి ఉద్యాన సబ్‌డివిజన్ పరిధిలో అరటి, మిరప, బొప్పాయి, దొండ, బెండ, తమలపాకు తదితర పంటలకు నష్టం వాటిల్లింది. వింజమూరు సబ్‌డివిజన్ పరిధిలో 450 ఎకరాల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేశారు. పంట నష్టాలను నమోదుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వింజమూరు ఉద్యానాధికారి సొహైల్ తెలిపారు. ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో బొప్పాయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన అధికారులు తెలిపారు.

150 ఎకరాల్లో దెబ్బతిన్న నారుమడులు

సోమశిల: అనంతసాగరం మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరినారు మడులు, 750 ఎకరాల్లో నాటిన వరి పైరు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవరాయపల్లి, కొత్తపల్లి, మినగల్లు, రేవూరు తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 కిలోల వంతున కేఎన్ఎం 1638 వరి రకాన్ని 80 శాతం సబ్సిడీతో అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ బాషా, రైతులు ఉన్నారు.

వరి పైర్లకు తీవ్ర నష్టం

సంగం: మిచాంగ్ తుఫాన్‌కు మండలంలో 1108 ఎకరాల్లో వరి నారు మడులు, 620 ఎకరాల్లో వరి పైరు దెబ్బతిన్నాయని ఏఓ శ్రీహరి తెలిపారు. బుధవారం ఆయన పలు ప్రాంతాల్లో పైర్ల నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మేరకు నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. రైతులను వెంటనే ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తామని చెప్పారు.

వరినారు మడుల పరిశీలన

చేజర్ల: మండలంలోని మడపల్లిలో దెబ్బతిన్న వరి నారు మడులను మండల ఏఓ శిధర్ బుధవారం పరిశీలించారు. మండలంలో సుమారు 1000 ఎకరాల్లో నారు మడులు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. వరి నారు మడులు ఎక్కడైనా దెబ్బతిని ఉంటే ఆర్‌బీకే సెంటర్లలో వీఏఏలకు తెలియజేయాలని కోరారు. రైతులకు రాయతీలో విత్తనాలు అందజేస్తామని తెలిపారు.

నీట మునిగిన నారుమళ్ల పరిశీలన

అల్లూరు : మిచాంగ్ తుఫాన్ కారణంగా నీట మునగిన నారుమళ్లను, వరినాట్లను క్షేత్ర స్థాయిలో రైతులతో కలిసి ఏఓ ఎ.లలిత పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంట నష్టాలను సేకరిస్తున్నామన్నారు. అవసరమైన రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందించేందుకు గ్రామాల వారీగా నివేదికను సిద్ధం చేశామన్నారు. అవసరమైన రైతులు వరి విత్తనాలను రాయితీపై ఆర్బీకేల్లో పొందవచ్చన్నారు. నారుమళ్లలో నుంచి నీటిని బయటకు పంపే మార్గం చేసిన వెంటనే 5 సెంట్ల నారుడికి 1 కేజీ యూరియా, 1 కేజీ పొటాష్ వేసుకోవాలన్నారు.

నేలవాలిన మొక్కజొన్న

అనుమసముద్రంపేట: భారీ వర్షాలకు మండలంలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట దాదాపు 250 ఎకరాల్లో నేలవాలింది. మండలంలోని గుడిపాడు మజారా కొత్తపల్లి, అక్బరాబాద్ గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఓ రజనీ క్షేత్ర స్థాయిలో పంట నష్టాలను పరిశీలించి ఈక్రాప్‌లో నమోదు చేశారు. నష్ట పరిహారం వచ్చేలా తీసుకుంటామని ధైర్యం చెప్పారు.



కొత్తపల్లిలో నేలవాలిన మొక్కజొన్న పంట



సంగం: నీటమునిగిన నారుమడులు



చేజర్ల: మడపల్లిలో నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ



అల్లూరు: రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ లలిత

పొగాకు నాణ్యతపై దృష్టి పెట్టండి

- తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొగాకు పైర్లు
- నాణ్యతకు తక్షణ చర్యలు తీసుకోండి
- పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు



దెబ్బతిన్న పొగాకు పంటలను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు అధికారులు, సిబ్బంది

మర్రిపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొగాకు పంట నాణ్యతపై రైతులు దృష్టి పెట్టాలని పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. తక్షణ చర్యలు చేపడితే నాణ్యత, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. డీసీపల్లి పొగాకు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్, సిబ్బందితో కలసి బుధవారం ఆయన గుండెమడకల, గండ్లవీడు, భైరవరం, ముస్తాపురం, డీసీపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలను చేశారు. పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలని, వీలైనంత త్వరగా పొలంలో మురుగునీరు పోయే వసతి కల్పించుకోవాలని సూచించారు. లేత తోటల్లో చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ మొక్కలు నాటే సమయంలో కాపర్ ఆక్సిక్లోరైడ్ 50 శాతం, బ్లైటాక్స్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొక్క పాదుల్లో పోసి నాటుకోవడం మంచిదన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత మొక్కల మొదళ్లలో వీలైతే గొర్రు వేసి ఎకరాకు 25 కిలోల అమ్మోనియం సల్ఫేట్ వేసుకోవాలన్నారు. 1శాతం పొటాషియం, నైట్రేట్ 100 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కలపై వీలైనంత త్వరగా పిచికారీ చేయాలన్నారు. పొలాలు ఆరిన వెంటనే అంతర సేద్యాన్ని చేస్తే మొక్క వేరు వ్యవస్థకు గాలి ప్రసరణ జరిగి కావాల్సిన పోషకాలు అంది పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. వర్షాల తర్వాత పొగతోటల్లో తెగుళ్లు సోకేందుకు ఆస్కారం ఉందని, లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 గ్రా. మందును 10 లీటర్లు లేదా నోవాల్యూరాన్ 10 మి.లీ. మందు 10 లీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు, అధిక వర్షాలు కురిసినప్పుడు గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుమచ్చ తెగులు వచ్చేందుకు ఆస్కారముందన్నారు. గత పంట కాలంలో నల్లకాడ తెగులు కనిపించిన పొలంలో, మురుగునీరు వెంటనే బయటకు పోయే సౌకర్యం లేని పొలాల్లో తిరిగి నల్లకాడ తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మైలుతుత్త ద్రావణం లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం బ్లైటాక్స్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి మొక్క పాదుల్లో ద్రావణాన్ని పోయాలన్నారు. మెటలాక్సిల్ 8 శాతం, మాంకోజెబ్ 64 శాతం, 20 గ్రా. 10 లీటర్ల నీటిలో లేదా అజోక్సిస్ట్రోబిన్, డైఫెనోకోనజల్ 10 మి.లీ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

వ్యవసాయాధికారి పరిశీలన

మండలంలో దెబ్బతిన్న పొగాకు పంటలను మర్రిపాడు ఏఓ రామ్మోహన్ పరిశీలించారు. పలు గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొగాకు పంటలో ఎక్కువ భాగం నష్టమేమి కలగలేదని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి'



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో బుధవారం 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని ఎంపీపీ పెయ్యల సంపూరణమ్మ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ దేవరాయపల్లి బిట్–1 సచివాలయ పరిధిలోని పాతదేవరాయపల్లి, ముత్తుకూరు గ్రామాల్లోని ప్రజలకు నాలుగున్నరేళ్లలో రూ.14 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కొన్ని కాలనీలను ఎన్నడూ లేని విధంగా సీసీ రోడ్లు నిర్మాణం చేశామన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ పుస్తకాలను అందజేసి ప్రతి గడపకు వెళ్లి జగనన్నకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. ఎంపీడీఓ మధుసూదన్, జేసీఎస్ మండల కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంఎల్ఓ మధు, గ్రామ సచివాలయ కన్వీనర్ సీహెచ్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు

చేజర్ల: మండలంలోని పెరుమాళ్లపాడు, చెల్లపనాయుడుపల్లి గ్రామాల్లో తుఫాన్ బాధిత కుటుంబాలకు రూ.2500 నగదు, 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, ఉల్లగడ్డలు, ఉల్లిపాయలు డీటీ విజయ్ ఆధ్వర్యంలో అందజేశారు. గత రెండు రోజులు వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్న పలు కుటుంబాలకు స్థానిక పాఠశాలల్లో పునరావాసం కల్పించారు.



ఆర్‌ఐ సుమతి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

రేపు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ఉదయగిరి: మండంలోని 17 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ కమిషన్ ఆదేశాల మేరకు 'పంచాయతీల పరిపాలన, సొంత నిధులు' అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. కార్యదర్శులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

అల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్స్ కిట్స్‌ను ఎంపీడీఓ జ్యోతి పంచాయతీ కార్యదర్శులకు బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యువతకు క్రీడా సామగ్రిని కూడా అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలపై తహసీల్దార్ విచారణ

ఉదయగిరి: పట్టణంలోని యూనియన్ రోడ్డులో నివాసం ఉంటున్న మోచి కులం వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసే విషయమై బుధవారం తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. మోచి కులస్తులు మాట్లాడుతూ తాము కొన్నేళ్ల నుంచి పట్టణంలో నివాసముంటున్నామన్నారు. 2016 సంవత్సరం వరకు తమను రెవెన్యూ అధికారులు ఎస్సీ కేటగిరీ కింద పరిగణిస్తూ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారన్నారు. ఆ తర్వాత ఏడాది నుంచి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఉచితంగా బియ్యం పంపిణీ



పంపిణీకి సిద్ధం చేస్తున్న బియ్యం

ఆత్మకూరు: మూడు రోజుల పాటు భారీ వర్షాలకు ఇబ్బందులు పడిన పేదలకు 25 కేజీల చొప్పున రెవెన్యూ అధికారులు బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టారు. బుధవారం ఆత్మకూరు ఎంఎల్ పాయింట్ నుంచి డిప్యూటీ తహసీల్దారు డీవీ శేషయ్య ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ వాహనాల ద్వారా మండలంలోని కరటంపాడు, బండారుపల్లి, రేవూరు, దేవరాయపల్లి, పాతదేవరాయపల్లి, తదితర గ్రామాలకు చెందిన 106 మంది పేదలకు బియ్యం పంపిణీ చేపట్టారు. తుఫాన్ సహాయం వెంటనే అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదోడి తలరాత మార్చిన దార్శనికుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశంలో పేదోడి తలరాతలు మార్చిన దార్శనికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి వాడని, అందరి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడన్నారు. ప్రపంచంలో ఏ రాజ్యాంగానికి లేని విశిష్టత భారత రాజ్యాంగానిదేనన్నారు. ప్రతి ఒక్కరూ మన రాజ్యాంగంలోని లక్ష్యాలను, ఆదర్శాలను అనుసరించాలన్నారు. భారతదేశం సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి డాక్టర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలితమేనన్నారు. అంబేడ్కర్ సూచించిన మార్గాన్నే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ, రాష్ట్రంలో పేద ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు సరికొత్త ప్రణాళికలతో పరిపాలన చేస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి శ్రీనివాసులు, నాయుడు రాంప్రసాద్, గుడ్లూరు మాల్యాద్రి, షేక్ షాహుల్ హమీద్, ఏటూరి పిచ్చిరెడ్డి, కందుల శ్రీనివాసులు, పరుసు మాల్యాద్రి, షేక్ ఖమర్‌బాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాలి

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడచుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలో జరిగిన అంబేడ్కర్ 67వ వర్ధంతి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మేకపాటి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పలువురు అంబేడ్కర్ భవనం శిథిలావస్థకు చేరుకుందని, మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీటీసీలు గొల్లపల్లి తిరుపతి, సుభానీ, ఉపసర్పంచ్ ముర్తూజా హుస్సేన్, దాసరపల్లి సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు అశోక్, దస్తగిరి, మట్ల రామయ్య, లక్ష్మయ్య, ఎస్థానీ, శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంగం: ఉడ్‌హౌస్‌పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామ యువకులు, పాఠశాల చిన్నారులు



మర్రిపాడు: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు ఆనందరావు, ఆర్ఐ సురేంద్ర, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది



వరికుంటపాడు: అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ మల్లికార్జున రెవెన్యూ సిబ్బంది




ఏఎస్‌పేట: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దారు లక్ష్మీనరసింహం, డీటీ సతీష్‌కుమార్ తదితరులు



చేజర్ల: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా తదితరులు



అల్లూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న యువజన సంఘం నాయకులు



ఆత్మకూరు: బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చేవూరు శ్రీధర్‌రెడ్డి, యువజన నాయకుడు వన్నం నాగరాజు తదితరులు

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



ప్రచార కిట్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మర్రిపాడు: రాష్ట్రంలో పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు అన్నారు. మండలంలోని పొంగూరులో బుధవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. గంగవరపు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు సంవత్సరాలుగా జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, ఆసరా, పెన్షన్ కానుక తదితర సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలను అందించేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పథకాలను అందిస్తోందన్నారు. నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, ఎంపీడీఓ నాగమణి, సర్పంచ్ అన్నపరెడ్డి రమణమ్మ, ఎంపీటీసీ చినకొండారెడ్డి, నాయకులు ఉర్లగంటి శ్రీనివాసులరెడ్డి, పార్లపల్లి పెదకొండారెడ్డి, శ్రీనివాసులు, కార్యదర్శి యు.రమేష్, ఏఓ విజయభాస్కర్ తదితరులు.

తుమ్మలకు మేకపాటి పరామర్శ



తుమ్మలను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని బుధవారం వడ్డిపాళెం గ్రామానికి వెళ్లి ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు దొంతిరెడ్డి నరసింహారెడ్డి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

దుత్తలూరు: స్థానిక బీసీ కాలనీకి చెందిన షేక్ రహీం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ నగదు సాయం కింద ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాలరెడ్డి నగదు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి బీమా కింద సహజ మరణం అయితే రూ.లక్ష అందించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, ఎంపీడీఓ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నజిముల్లా తదితరులున్నారు.

సాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు సాగునీరందేలా చూడాలని విన్నవిస్తున్న రైతులు

సంగం: తుఫాన్ ప్రభావంతో సోమశిల జలాశయానికి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో కావలి కాలువ ఆయకట్టులోని ఏడు గ్రామాల రైతులకు సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని బుధవారం రైతులు తహసీల్దారు నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ ఐఏబీ సమావేశంలో తీర్మానించిన ప్రకారం డెల్టా కింద రైతులకే సాగునీరిస్తామని చెప్పారన్నారు. ఆ సమావేశం నాటికి జలాశయంలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున, తాము కూడా పంటల సాగును నిలిపేశామన్నారు. ప్రస్తుతం వర్షాలకు చెరువులకు నీరు చేరడం, జలాశయానికి వరద వస్తున్న నేపథ్యంలో కావలి కాలువ ఆయకట్టుకు కూడా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ తెలిపారు.